నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, శనివారం 23 మార్చి 2024 | SANGAREDDY

కేసీఆర్‌కు కృతజ్ఞతలు

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి

మెదక్ ఎంపీ అభ్యర్థిగా తన పేరును ప్రకటించినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో కేసీఆర్ సమావేశం నిర్వహించారని, సమావేశంలో ఏకాభిప్రాయంతో తన పేరును ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. తన పేరును ప్రతిపాదించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో దాదాపు పదేండ్లు అధికారిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అందరినీ భాగస్వాములు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించానన్నారు. ప్రజలతో మమేకమై ఉన్నందునే ఈ అవకాశం దక్కిందని, మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే భాగ్యం కేసీఆర్ కల్పించడం చాలా సంతోషంగా ఉందని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.

మెదక్ బరిలో మాజీ కలెక్టర్

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి

- మెదక్ జేసీగా, సిద్దిపేట కలెక్టర్‌గా సుదీర్ఘకాలం సేవలు
- జిల్లాలో రిజర్వాయర్ల భూసేకరణలో తనదైన పాత్ర
- రైల్వే భూసేకరణ, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో కీలక పాత్ర
- ఎక్కడా లేని విధంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణం
- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు
- పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించి ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- అభ్యర్థి ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు
- ఈనెల 26 నుంచి 30వరకు నియోజకవర్గ సమావేశాలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, మార్చి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్, ఎమ్మెల్సీ పి.వెంకట్రామిరెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరిసుభాష్‌రెడ్డి, వంటేరు యాదవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, మదన్‌రెడ్డి, సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులతో కేసీఆర్ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో సమావేశమై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పార్టీ అభ్యర్థిగా పి.వెంకట్రామిరెడ్డిని ప్రకటించారు. ఇప్పటికే జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి గాలి అనిల్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించగా, ఆయన పార్టీ క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మెదక్, జహీరాబాద్ రెండు బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు. రెండుచోట్ల విజయం సాధించి మరోసారి సత్తా చాటేలా బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తున్నది.

ఉమ్మడి మెదక్ జిల్లాతో వెంకట్రామిరెడ్డికి అనుబంధం

ఉమ్మడి మెదక్ జిల్లాతో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డికి అనుబంధం ఉంది. జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పాటు జిల్లా ప్రజలకు ఆయన సేవలు అందించారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కేసీఆర్, హరీశ్‌రావుకు సన్నిహితంగా ఉంటూ పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేర్చారు. గత శాసనసభ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేశారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఆయనను ప్రకటించారు. అధికారిగా జిల్లాలో ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై జిల్లా అభివృద్ధికి కృషిచేశారు. వెంకట్రామిరెడ్డి స్వస్థలం పాత కరీంనగర్ జిల్లా, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండల కేంద్రం. తండ్రి రాజిరెడ్డి ప్రముఖ న్యాయవాది. వెంకట్రామిరెడ్డి 1996లో గ్రూప్-1 ఉద్యోగం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా చేరి, అనంతరం ఆర్డీవోగా బందరు, చిత్తూరు, తిరుపతిలో పనిచేశారు. పీడీ డీడబ్ల్యూఎంఏ మెదక్, హుడా సెక్రటరీ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ఇన్‌క్యాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వర్తించాడు. 2007లో ఐఏఎస్ హోదా పొందారు. ఆయన 24 మార్చి 2015 నుంచి 10 అక్టోబర్ 2016 వరకు ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన తరువాత 11 అక్టోబర్ 2016 నుంచి సిద్దిపేట కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2018 సార్వత్రిక ఎన్నికల సమయంలో 8 నెలల పాటు రాజన్న సిరిసిల్ల కలెక్టర్ పనిచేశారు. తర్వాత 2020 దుబ్బాక ఉపఎన్నికల సమయంలో సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేశారు. ఎన్నికల అనంతరం తిరిగి సిద్దిపేట కలెక్టర్‌గానే బాధ్యతలు చేపట్టి 15 నవంబర్ 2021న సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి, స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బీఆర్ఎస్‌లో చేరారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 30 నవంబర్ 2027 వరకు ఆయన పదవీకాలం ఉంది. ఏడేండ్ల పైగానే ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్, సిద్దిపేట కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి బాధ్యతలు నిర్వర్తించి అభివృద్ధికి కృషిచేశారు.

రిజర్వాయర్ల నిర్మాణంలో కీలక పాత్ర

వెంకట్రామిరెడ్డి కలెక్టర్ ఉన్న సమయంలో సిద్దిపేట జిల్లాలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణ చేయడంలో ఆయన కృషి ఎంతో ఉంది. ప్రపంచంలోనే ఒక గొప్ప ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఎక్కడా లేనివిధంగా 6వేల కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించడం విశేషం. మిషన్ భగీరథ లాంటి పథకాన్ని వంద శాతం పూర్తి చేయడంతో పాటు రైల్వేలైన్‌కు సంబంధించి భూసేకరణను 90శాతం పూర్తి చేయడంలో విశేష కృషిచేశారు. జిల్లాలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. పేద విద్యార్థులను అక్కున చేర్చుకున్నారు. రాధా, రమణి అనే అనాథ పిల్లలకు ఆలనా పాలనా అన్నీ తానే చూస్తున్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గరయ్యారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని ప్రకటించడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దత్తత తీసుకున్న అనాథ అమ్మాయిలతో...

బీఆర్ఎస్‌లో జోష్

మెదక్, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జోష్‌లో ఉన్నారు. జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, మెదక్ నుంచి పి.వెంకట్రామిరెడ్డి, సిద్దిపేట జిల్లాలోకి వచ్చే కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వినోద్‌కుమార్‌ను ప్రకటించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పార్లమెంట్ పరిధిలో అన్ని శాసనసభ స్థానాలను తిరుగుతూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తలను కలుస్తున్నారు. మెదక్ అభ్యర్థిగా పి.వెంకట్రామిరెడ్డిని ప్రకటించడంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించడానికి పార్టీ సమాయత్తం అవుతున్నది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో ఈనెల 26 నుంచి 30 వరకు పార్టీ సమావేశాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

చిలిపిచెడ్‌లో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కేసీఆర్ చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది

కేసీఆర్ పాలనలో ప్రగతి పరుగులు

- కాంగ్రెస్ హయాంలో పథకాలు బంద్
- మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్ ఇద్దాం..
- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, మార్చి 22: కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు పర్చిన సంక్షేమ పథకాలే మెదక్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తాయని బీఆర్ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శీలాంపల్లిలో బీఆర్ఎస్ నాయకుడి గృహప్రవేశానికి హాజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటికీ చాలా మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా.. ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చేరలేదని విమర్శించారు. వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీగా గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని క్యాడర్‌కు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, దుర్గారెడ్డి, సంగాగౌడ్, విఠల్, ముకుందరెడ్డి, శంకరయ్య, భీమయ్య, రాజేందర్‌రెడ్డి, వీరాస్వామి, విఠల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

చిలిపిచెడ్, మార్చి 22: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని బీఆర్ఎస్ చిలిపిచెడ్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అన్నారు. వెంకట్రామిరెడ్డికి టికెట్ కేటాయించినందుకు బీఆర్ఎస్ రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల కృషితో మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిస్తాం

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 22: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, మేర్గు మహేశ్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోట అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన అభివృద్ధి పనులే పార్టీ అభ్యర్థిని గెలిపిస్తాయన్నారు. ఏకకాలంలో రూ. 2లక్షల పంట రుణమాఫీ, రైతుబంధు రూ.15వేలు పెంపు వంటి హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు మోసం చేస్తున్నదని విమర్శించారు. వెంకట్రామిరెడ్డికి మెదక్ జిల్లా ప్రజలతో ఎంతో అనుబంధం ఉందని, ఆయనను అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రావణ్, శ్యాం, రవితేజ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో పక్కాగా తనిఖీలు చేయాలి

- మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

పోచారం వద్ద వాహన తనిఖీ చేస్తున్న మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలు పక్కాగా చేపట్టాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్ నియోజకవర్గం హవేళీ ఘనపూర్ మండలంలోని పోచమ్మరాల్ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్‌తో కలసి ఆయన ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లను పరిశీలించి స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతర రత్రా కానుకల పంపిణీ చేసే అవకాశం ఉన్నందున, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ అకౌంటింగ్, వీడియో సర్వేలెన్స్, వ్యయ పరిశీలకుల బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలు కూడిన రసీదులను అందజేయాలని రాహుల్‌రాజ్ సూచించారు.

ములుగు అటవీ కళాశాల డీన్‌గా ఆశ

డాక్టర్ ఎస్‌జే ఆశ

ములుగు, మార్చి 22: సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రం నూతన డీన్‌గా డాక్టర్ ఎస్‌జే ఆశను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపక బృందం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. తనపై నమ్మకంతో డీన్‌గా బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు, నూతన పరిశోధనలకు తనవంతుగా కృషిచేస్తానని తెలిపారు.

ఒంటిపై బంగారు నగలతో విజయ్‌కుమార్

నీ ఒళ్లు బంగారం కాను..

అల్లాదుర్గం, మార్చి 22: ఒంటిపై పదికిలోల బంగారు ఆభరణాతో పూజాకార్యక్రమానికి హాజరైన వ్యక్తి అందరినీ ఆకట్టుకున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన హోప్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ హాకీ ఫెడరేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ వచ్చారు. ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో సెల్ఫీలు దిగడానికి భక్తులు ఆసక్తి కనబర్చారు.

భారీ మెజార్టీ కట్టబెడతాం

నర్సాపూర్, మార్చి 22 : మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంకట్రామిరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా, సిద్దిపేట జిల్లాకు కలెక్టర్‌గా పనిచేశారన్నారు. ఈ ప్రాంతంపై వెంకట్రామిరెడ్డికి మంచి అవగాహన ఉందని, ఆయన అందరికీ సుపరిచితుడని తెలిపారు. ఇలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీగా పోటీ చేసేందుకు టికెట్ కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. వెంకట్రామిరెడ్డికి నర్సాపూర్ నుంచి భారీ మెజార్టీ అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సూరారం నర్సింహులు, నగేశ్, ఆంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్, బాల్‌రెడ్డి, రింగుల ప్రసాద్, వెంకటేశ్, నాగరాజుగౌడ్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్

బీఆర్ఎస్ విజయం ఖాయం

- బీఆర్ఎస్ మాసాయిపేట మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

వెల్దుర్తి, మార్చి 22: మెదక్ పార్లమెంట్ స్థానంలో మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి విజయం ఖాయమని బీఆర్ఎస్ మాసాయిపేట మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదేండ్లలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీ విజయానికి దోహదపడతాయన్నారు. వెంకట్రామిరెడ్డికి ఉమ్మడి మెదక్ జిల్లాతో అనుబంధం ఉన్నదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో కలసిమెలిసి పనిచేసి వెంకట్రామిరెడ్డి విజయానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ముదిరాజ్‌ల గ్రామ బహిష్కరణ

ఖాజీపూర్‌లో గ్రామస్తుల నిర్ణయం.. విచారణ చేపట్టిన అధికారులు

మిరుదొడ్డి: ఖాజీపూర్ విచారణ చేపట్టిన ఆయా శాఖల అధికారులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి)/సిద్దిపేట అర్బన్, మార్చి 22 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో శుక్రవారం ముదిరాజ్ కులస్తులకు గ్రామ బహిష్కరణ విధించారు. ముదిరాజ్ కులస్తుల వివరాల ప్రకారం.. ఖాజీపూర్ పెద్ద చెరువులోని చేపలను పట్టి విక్రయించే విషయంలో గ్రామంలో వివాదం ఏర్పడింది. కులవృత్తిని నమ్ముకున్న ముదిరాజ్ కులస్తులకు గ్రామంలో చేపలు పట్టే హక్కు లేదని కొన్ని కులాలు అడ్డుపడుతున్నాయి. 1994లో మత్స్యశాఖ సొసైటీ ఏర్పడినప్పటి నుంచి చేపలు పట్టుకునే పరిస్థితి లేదు. ఏటా చేపలను పట్టకుండా గ్రామంలోని కొన్ని కులాల పెద్దలు అడ్డుపడుతున్నారు. ఈనెల 21న సొసైటీ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకునే క్రమంలో గ్రామానికి చెందిన ఆయా కులాల పెద్దలు అధికారులను బెదిరించి వెనక్కి పంపించారు. గ్రామస్తుల మాట కాదని చెరువులో చేపలు పట్టవద్దని, సొసైటీలో కొత్తగా సభ్యులను ఎలా చేర్చుకుంటారని ఇతర కులాల పెద్దలు ముదిరాజ్‌లకు గ్రామ బహిష్కరణ విధించారు. గ్రామంలో తమకు ఎవరూ సహకరించడం లేదని, నిత్యావసర సరుకులు లభించడం లేదని ముదిరాజ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గ్రామస్తులు సహకరిస్తే జరిమానా విధిస్తారనే భయంతో గ్రామంలో ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించామని ముదిరాజ్‌లు తెలిపారు.

విచారణ చేపట్టిన అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ బహిష్కరణ విషయమై జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ అధికారి సరోజ, తహసీల్దార్ జయంత్, ప్రత్యేకాధికారి వీరేశ్, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. తాతల కాలం నాటి నుంచి పెద్ద చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని వస్తుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్తుల తీర్మానం ప్రకారం చెరువులో పట్టిన చేపలు విక్రయించిన డబ్బులతో గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క చెరువు విషయం తప్ప ముదిరాజ్ కులస్తులతో గ్రామస్తులకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. జరిగిన సంఘటనపై కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

పద్యానికి 1200 ఏండ్ల చరిత్ర

- తారా కళాశాల ప్రపంచ కవితా దినోత్సవంలో ప్రొఫెసర్, కవి చల్లా శ్రీరామచంద్రమూర్తి

మాట్లాడుతున్న బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, కవి చల్లా శ్రీరామచంద్రమూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 22: పద్యానికి 1200 ఏండ్లు నిండాయని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, కవి చల్లా శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తారా ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'తెలుగు పద్య సౌందర్యం' అనే అంశంపై కవి ప్రసంగిస్తూ ప్రాచీన కవిత్వం నుంచి ఆధునిక సాహిత్యం వరకు పద్య సౌందర్యాన్ని వివరించారు. నన్నయ, తిక్కన, ఎర్రన కవుల పద్యాల్లోని చమత్కారాన్ని రూపుకట్టించారు. పద్యంలోని ప్రతి అక్షరానికి ఒక అర్థం ఎలా ఉంటుందనే పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. కవిత్వంతో జ్ఞానం, ఆహ్లాదం, ఆనందం కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యత అలవాటవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ రాపోలు శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏవీ శర్మ, అధ్యాపకులు డాక్టర్ మంజుశ్రీ, డాక్టర్ మహంతయ్య, డాక్టర్ సుమతి, జలీల్, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణకోటి మనుగడకు నీరే ఆధారం

ప్రపంచ జల దినోత్సవాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, వృక్షశాస్త్ర సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భూమిపై జీవరాశి మనుగడకు ప్రధాన ఆధారం నీరే అని పేర్కొన్నారు. నీరు లేనిదే భూమిపై జీవం లేదన్నారు. భావితరాల కోసం ప్రతి బిందువును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటిని వృథాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్దులు, డాక్టర్ అభిజిత్, డాక్టర్‌వెంకటేశం, డాక్టర్ జగదీశ్వర్, శివదీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.